

# ఎన్టీఆర్ వన్‌మ్యాన్‌షో 'దేవర'

**''దేవర'లో** నా తమ్ముడు యాక్టింగ్‌తో అదరగొట్టాడు. ఇది ఎన్టీఆర్ వన్‌మ్యాన్ షో అని గర్వంగా చెబుతున్నా. ఇంతటి భారీ విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు' అన్నారు కల్యాణ్ రామ్. 'దేవర' చిత్రానికి ఆయన సమర్పకుడిగా వ్యవహరించారు. ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన 'దేవర' చిత్రం శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర బృందం మీడియా సమావేశాన్ని నిర్వహించింది. దర్శకుడు కొరటాల శివ మాట్లాడుతూ 'మూడేళ్లుగా ఈ సినిమాతో ప్రయాణం సాగిస్తున్నా. నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారంతో 'దేవర' చిత్రం అద్భుతంగా రూపుదిద్దుకుంది. ఇది నా కెరీర్‌లోనే బెస్ట్ ఫిల్మ్ అని అందరూ మెచ్చుకుంటున్నారు' అని చెప్పారు. ఈ చిత్రానికి విదేశాల్లో కూడా అద్భుతమైన ఆదరణ లభిస్తున్నదని, ఎన్టీఆర్ నటన మరో స్థాయిలో ఉందని, ఇది ఆయన వన్‌మ్యాన్‌షో అని నైజాంలో 'దేవర'ను డిస్ట్రిబ్యూట్ చేసిన అగ్ర నిర్మాత దిల్ రాజు పేర్కొన్నారు.

# రాజావారి హంగామా



**నార్నే నితిన్ హీరోగా** రూపొందిన లవ్, ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'శ్రీ శ్రీ శ్రీ రాజావారు'. సతీశ్ వేగేశ్న దర్శకుడు. చింతపల్లి రామారావు నిర్మాత. సంపద ఇందులో కథానాయిక. దసరా కానుకగా సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. దర్శకుడు వంశీ పైడిపల్లి టీజర్‌ని లాంచ్ చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. మ్యాడ్, ఆయ్ చిత్రాలతో వరుస విజయాలను అందుకు హీరో నార్నె నితిన్ ఈ సినిమాతో హ్యాట్రిక్ కొట్టనున్నాడని, 'శతమానంభవతి' తర్వాత దర్శకుడు వేగేశ్న సతీశ్ నుంచి వస్తున్న మరో అద్భుతమైన ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఇదని నిర్మాత తెలిపారు. నరేశ్, రావురమేష్, రఘు కుంచె, ప్రవీణ్, రచ్చ రవి, సరయు తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: దాము నర్రావుల, సంగీతం: కైలాష్ మీనన్, సమర్పణ: రంగాపురం రాఘవేంద్ర, మురళీకృష్ణ చింతలపాటి.

# ఇందు రెబెకా వర్గీస్‌గా సాయిపల్లవి



**శివకార్తికేయన్ హీరోగా** నటిస్తున్న తాజా తమిళ చిత్రం 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకుడు. సాయిపల్లవి కథానాయికగా నటిస్తున్నది. శివ్ అరూర్, రాహుల్ సింగ్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' అనే పుస్తకంలోని మేజర్ వరదరాజన్ అధ్యాయం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మేజర్ వరదరాజన్ పాత్రను శివకార్తికేయన్ పోషిస్తున్నారు. ఈ సినిమాలో ఇందు రెబెకా వర్గీస్‌గా సాయిపల్లవిని పరిచయం చేస్తూ ఇంట్రో వీడియోను విడుదల చేశారు. రిపబ్లిక్ డే పరేడ్‌తో మొదలైన ఈ ఇంట్రో వీడియో ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఇందులో సాయిపల్లవి తనదైన నటనతో కట్టిపడేసింది. సాయిపల్లవి, శివకార్తికేయన్ మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంది. దేశభక్తి, సాహసం ప్రధానంగా ఈ సినిమా స్ఫూర్తివంతంగా సాగుతుందని, దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రాన్ని శ్రేష్ట్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నిఖిత రెడ్డి తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేయబోతున్నారు.



# వేరే కోణంలో చూడొద్దు ప్లీజ్..

**డేటింగ్ యాప్‌లో** సెలబ్రిటీల పేర్లు ప్రస్తుతం బీటౌన్‌లో చర్చనీయాంశం అయ్యింది. ఈ పేర్లలో బాలీవుడ్ భామ ఊర్వశీ రౌతేలా పేరు కూడా ఉండటంతో.. ఈ వ్యవహారంపై ఊర్వశీ స్పందించింది. 'కేవలం మేం మాట్లాడుకోవడం కోసమే ఈ యాప్‌లో లాగిన్ అయ్యాం. ఇందులో నాతో పాటు హృతిక్, ఆదిత్యరాయ్.. ఇలా చాలామంది పేర్లున్నాయి. సమయం దొరికినప్పుడల్లా ఈ యాప్ ద్వారా మాట్లాడుకుంటూ ఉంటాం. లీజర్ టైమ్‌లో ఒకరికొకరం రిక్వెస్టులు పెట్టుకుంటాం. దయచేసి దీన్ని వేరే కోణంలో చూడొద్దు. ప్లీజ్..' అంటూ రిక్వెస్ట్ చేసింది ఊర్వశీ రౌతేలా. ప్రస్తుతం ఈ అందాలభామ టాలీవుడ్‌లో నటిస్తున్న విషయం తెలిసిందే. బాలకృష్ణ హీరోగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రంలో ఊర్వశి కీలక పాత్ర పోషిస్తున్నది. ఈ సినిమా గురించి ఇటీవల మాట్లాడుతూ 'బలమైన కథతో రూపొందుతోన్న చిత్రమిది. ఇందులో నా పాత్ర కొత్తగా ఉంటుంది. బాలయ్యసార్‌తో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. ఆయన గొప్ప నటుడు మాత్రమే కాదు, మంచి వ్యక్తి కూడా. టాలీవుడ్ వాతావరణం నాకెంతో నచ్చింది. ఇక్కడ మరిన్ని సినిమాలు చేయాలని ఉంది' అంటూ చెప్పుకొచ్చింది ఊర్వశీ రౌతేలా.

# పరశురాముడిగా ప్రభాస్?



**పౌరాణిక** పాత్రలకు సరిగ్గా సరిపోయే ఫిజిక్ ప్రభాస్‌ది. ఇప్పటికే 'ఆదిపురుష్'లో రాముడిగా, 'కల్కి 2898'లో కర్ణుడిగా కనిపించి ప్రేక్షకులను అలరించారాయన. త్వరలో రానున్న 'కన్నప్ప'లో నందీశ్వరుడిగా కనిపిస్తారని టాక్ వినిపిస్తున్నది. ఇదిలావుంటే.. బీటౌన్‌లో ప్రభాస్‌కి సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త బలంగా వినిస్తున్నది. ప్రభాస్ మళ్లీ రామాయణ కథలో నటించనున్నారట. వివరాల్లోకెళ్తే.. ప్రస్తుతం దర్శకుడు నితీశ్ తివారి 'రామాయణం' తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. అందులో రాముడిగా రణబీర్‌కపూర్ నటిస్తుండగా, సీతగా సాయిపల్లవి కనిపించనుంది. ఈ సినిమాలో సీతారాముల కల్యాణఘట్టాన్ని కన్నుల పండువగా తీయాలనే తలంపుతో ఉన్నారట నితీష్ తివారి. ఈ ఘట్టంలో పరశురాముడి పాత్ర చాలా కీలకం. ఆ పాత్రకోసం ప్రభాస్‌ని కలిశారట నితీశ్ తివారి. విష్ణుమూర్తి దశావతారాల్లో రామావతారానికి ముందు వచ్చే అవతారం పరశురామావతారం. రాముడిగా రణబీర్‌కపూర్ చేస్తున్నప్పుడు, పరశురాముడిగా కూడా ఆ స్థాయి హీరో చేస్తే సబబుగా ఉంటుందని నితీశ్ భావించారట. దాంతో ఆయన ప్రభాస్‌ని కలిశారట. ప్రభాస్ కూడా పరశురాముడిగా నటించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తున్నది. దీనికి సంబంధించిన నిజానిజాలు ఇంకొన్ని రోజుల్లో వెల్లడి కానున్నాయి.






# మల్టీస్టారర్‌కి సన్నాహాలు?

**తమిళనాట ఓ భారీ మల్టీస్టారర్‌కి** రంగం సిద్ధమైంది. కోలీవుడ్ సమాచారం ప్రకారం శంకర్ దర్శకత్వంలో ఈ పాన్‌ఇండియా సినిమా తెరకెక్కనున్నది. ఇందులో విక్రమ్, సూర్య కలిసి నటిస్తారట. వీరిద్దరూ 21ఏండ్ల క్రితం 'పితామగన్' చిత్రంలో కలిసి నటించారు. బాలా దర్శకత్వంలో రూపొందిన ఆ చిత్రం ఘన విజయాన్ని అందుకుంది. తెలుగులో 'శివపుత్రుడు'గా విడుదలై ఇక్కడా అఖండ విజయాన్ని చవిచూసింది. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత విక్రమ్, సూర్య తెరను పంచుకోబోతున్నారనే వార్త వారి అభిమానుల్లో చెప్పలేనంత ఆనందాన్ని ఇస్తున్నది. తమిళనాట ప్రాచుర్యం పొందిన 'వేల్పారి' అనే నవల ఆధారంగా శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారట. మూడు భాగాలుగా ఈ సినిమా రానున్నదని తమిళ వర్గాలు కోడై కూస్తున్నాయి. వెయ్యికోట్ల భారీ బడ్జెట్‌తో మూడు భాగాలూ ఒకేసారి షూట్ చేసి, రెండు నెలల వ్యవధితో విడుదల చేయాలన్నది శంకర్ ప్లాన్ అట. అయితే.. ఇంత పెద్ద ప్రాజెక్ట్ పట్టాలెక్కాలంటే ముందు శంకర్‌కి అర్జంట్‌గా హిట్ అవసరం. రామ్‌చరణ్ హీరోగా ఆయన దర్శకత్వం వహించిన 'గేమ్‌చేంజర్' డిసెంబర్ 20న విడుదల కానుంది. ఈ సినిమా హిట్ అయితే, సూర్య, విక్రమ్‌ల సినిమాకు మార్గం సుగమం అయినట్టేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# సుప్రీంకోర్టులో '12th ఫెయిల్' ప్రదర్శన

**బాలీవుడ్ దర్శకుడు విధు వినోద్ చోప్రా** తెరకెక్కించిన '12th ఫెయిల్' స్ఫూర్తిదాయక కథాంశంతో విమర్శకుల ప్రశంసలు పొందింది. విక్రాంత్ మస్సే, మేధా శంకర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ఐపీఎస్ మనోజ్ కుమార్ శర్మ జీవితం ఆధారంగా తెరకెక్కించారు. ఇంటర్ ఫెయిలైనా నిరుత్సాహపడకుండా ఐపీఎస్ సాధించిన మనోజ్‌కుమార్ ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. తాజాగా ఈ చిత్రం అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ కోసం సుప్రీంకోర్టులో ఈ సినిమాను ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఇందులో న్యాయవాదులు, వారి కటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు. ఇలాంటి సినిమాలు ప్రజల్లో స్ఫూర్తి నింపుతాయని సీజేఐ చిత్ర బృందాన్ని ప్రశంసించారు. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు చూస్తున్నప్పుడు కన్నీళ్లొచ్చాయని ఆయన అన్నారు. నటీనటులందరూ తమ పాత్రల్లో ఒదిగిపోయారని, మనిషి ఎల్లప్పుడు ఆశతో జీవించాలని, అప్పుడే జీవిత లక్ష్యాన్ని చేరుకోవచ్చనే సందేశంతో సినిమా తీశారని సీజేఐ చిత్ర బృందాన్ని అభినందించారు. తన జీవితంలో ఇవి మధుర క్షణాలని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కలిసి సినిమా చూడటం సంతోషంగా ఉందని, ఐదేళ్ల పాటు శ్రమించి ఈ సినిమా చేశానని దర్శకుడు విధు వినోద్ చోప్రా తెలిపారు.




# ఇరవై ఏండ్లుగా తెరచుకోని లాకర్

**త్రిగుణ, మేఘాచౌదరి** లీడ్‌రోల్స్ చేస్తున్న కామెడీ థ్రిల్లర్ 'జిగేల్'. మల్లి యేలూరి దర్శకుడు. డా.వై.జగన్‌మోహన్, నాగార్జున అల్లం నిర్మాతలు. త్వరలో సినిమా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. దర్శకుడు హను రాఘవపూడి టీజర్‌ని లాంచ్ చేశారు. త్రిగుణను లాకర్ టెక్నీషియన్‌గా పరిచయం చేస్తూ టీజర్ మొదలైంది. ఇరవై ఏండ్లుగా ఎలా తెరవాలో తెలియని ఓ లాకర్‌ని ప్రజెంట్ చేస్తూ వచ్చిన సీక్వెన్స్ ఆసక్తికరంగా ఉంది. హీరో పాత్ర చిత్రణ, హీరోహీరోయిన్ల లవ్ ట్రాక్‌తో టీజర్ కలర్‌ఫుల్ డిజైన్ చేశారు. ఇంకా షాయాజీ షిండే, పోసాని కూడా టీజర్‌లో కనిపించారు. రఘుబాబు, పృథ్వీరాజ్, మధునందన్, ముక్కు అవినాశ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వాసు, మాటలు: రమేశ్ చెప్పాల, నాగార్జున అల్లం, సంగీతం: ఆనంద్ మంత్ర, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు.

